క్లుప్తంగా

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



స్నపన తిరుమంజనంలో ఉత్సవ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో గురువారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. స్నపన తిరుమంజనం, శ్రీరామ పట్టాభిషేకం, సీతమ్మకు చీర సారే ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమాలు జరిగాయి. లలితాంబికా నృత్య కళానిలయం సత్యస్నేహిత ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు. లలితా సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కర్నూలు కల్చరల్: స్థానిక భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి, సుబ్రహ్మణ్యం, పార్వతీ పరమేశ్వర, నవగ్రహ ధ్వజ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు మహా గణపతి పూజ, రుద్రాభిషేకం, కలశస్థాపన, సాయంత్రం అఖండ దీప స్థాపన, మహా మంగళహారతి, 21వ తేదీ ఉద యం 8 గంటలకు ప్రాతకాల పూజలు, రుద్ర, చండీ, నవగ్రహ హోమాలు, సాయంత్రం దేవ తా పరివాహర హోమాలు, మహా మంగళహారతి, 22వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రాతకాల పూజలు, దీక్షా ప్రతిష్ఠా హోమం, 9.40 గంటలకు యంత్ర ప్రతిష్ఠ విగ్రహ ప్రతిష్ఠ, కూష్మాండ బలిహరణ, మహా పూర్ణాహుతి, ప్రథమ దర్శన పూజలు, అన్నదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

సీపీఎం అభ్యర్థి ప్రచారం

కర్నూలు(సెంట్రల్): పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ గురువారం కల్లూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఐ బలపరుస్తున్న తనను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎం.రాజశేఖర్, రమణమూర్తి, నాగరాజు, సుధాకర్, గోవిందు, వెంకటరాముడు, శీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

కర్నూలు (అగ్రికల్చర్): మండల పరిధిలోని మామిదాలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ సామర్థ్యం పెంపు పనులు నిర్వహిస్తున్నందున మామిదాలపాడుతో పాటు మునగాలపాడు గ్రామాలకు శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌పై లోడ్ పెరిగిన కారణంగా సామర్థ్యాన్ని ఐదు ఎంవీఏకి పెంచుతుండటం వల్ల విద్యుత్ సరఫరా కొద్ది గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జగనన్న వస్తేనే ఇంటింటా సంతోషం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
- మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, పార్టీ నాయకులతో కలిసి 4 వ వార్డులో పర్యటన



ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఇంతియాజ్, చిత్రంలో పార్టీ నాయకులు సుభాష్ చంద్రబోస్, సీహెచ్ మద్దయ్య తదితరులు

కర్నూలు (టౌన్): తనకు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అవకాశమిస్తే కర్నూలు నగరాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక 4వ వార్డు పరిధిలోని గనీగల్లీ, జిందాబాయి మసీదు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అహమ్మద్ అలీఖాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, సీహెచ్ మద్దయ్య స్థానిక కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్‌తో కలిసి ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో విస్తృతంగా పర్యటించిన ఆయన ఇంటింటికి వెళ్లి, ఓటర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి న్యాయం చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఐదేళ్ల పాలనలో ఒక్క అవినీతి లేదన్నారు. ప్రతి కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారన్నారు. అర్హులకు డీబీటీ విధానంలో రూ.2.65 లక్షల కోట్లు నేరుగా వారి అకౌంట్లలో వేశారన్నారు. చిన్న, సామాన్య కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. ఇళ్ల పట్టాలు, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా తదితర పథకాలను నేరుగా మహిళలకే అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారని చెప్పారు. వివిధ రూపాల్లో పేదలకు సాయం చేస్తున్న వైఎస్ జగన్‌ను ఇబ్బందులు పెట్టే చంద్రబాబును ఎన్నికల్లో ఓడించాలన్నారు. జగనన్న వస్తేనే రాష్ట్రంలోని ప్రతి గడప సంతోషంగా ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ చెప్పిన మాటకు కట్టుబడి మాట మీద నిలబడే ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకుడు అహమ్మద్ అలీఖాన్, మద్దూరు సుభాష్ చంద్రబోస్, సీహెచ్ మద్దయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మైనార్టీలు వివక్షకు గురయ్యారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫరాజ్ ఖాన్, శేషు యాదవ్, పార్టీ మహిళా నాయకులు సుచరిత, జమిలా తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



20వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- చంద్రబాబు హామీలను నమ్మొద్దు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని..టీడీపీ అధినేత చంద్రబాబును, ఆయన హామీలను ప్రజలెవ్వరూ నమ్మరని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 20వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో పొదుపు సంఘాలు, రైతు రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి 2014లో మాదిరి మోసం చేయడానికి వస్తున్నారన విషయం రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. కూటమి పార్టీ ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మె పరిస్థితుల్లో లేరన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా పేద ప్రజల అభ్యున్నతికి అమలు చేశామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో ఏళ్లుగా ఎన్నికలకు నోచుకోని మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థలు, ఇతర స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించామన్నారు. కర్నూలు నగరంలో పాలక వర్గం ఏర్పడిన తర్వాత నగరంలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతలను అనుసరించి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. నగరంతో పాటు కల్లూరు అర్బన్‌లోని 16 వార్డుల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లక్ష్మీరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు భీమాశంకర్‌రెడ్డి, సుకుమార్, మద్దయ్య, బత్తుల లక్ష్మయ్య, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, వార్డు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న వలసలు



వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరిన దిన్నెదేవరపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. గురువారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన 25 కుటుంబాలు ఎంపీటీసీ మద్దిలేటి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. నియోజకవర్గ క్యాంప్ ఆఫీస్‌లో వారికి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. అనంతరంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ ఖాళీ అవుతోందన్నారు. ఆ పార్టీలో పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత లేకపోవడంతో ప్రతిరోజూ వందలాదిమంది తమ పార్టీలో చేరుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీలో వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో జయచంద్రుడు, శివకృష్ణ, బి.రాము, కె.భాస్కర్, గంగన్న, అశోక్‌కుమార్, బి.భాస్కర్, మధు, ఖాజా, చందు, భాస్కర్, నాగేంద్ర, మనోహర్, జయరాముడు, పరుశురాం, రాము, సురేష్, వెంకటేష్, సుధాకర్, రామకృష్ణ, మధుకుమార్, సుంకన్న ఉన్నారు.



పార్టీలో చేరిన బి.తాండ్రపాడు, 38, 39, 40వ వార్డులకు చెందిన టీడీపీ కార్యకర్తలు

- బి.తాండ్రపాడు పరిధిలోని ప్రజానగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే కర్నూలు అర్బన్‌లోని 38, 39, 40 వార్డులకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరిలో కళ్యాణ్‌రామ్ రెడ్డి, ఎండీ అస్లాం, సయ్యద్ ముజమ్మిల్‌తో పాటు 250 మంది టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

తొలిరోజు మూడు నామినేషన్ల దాఖలు

కర్నూలు (టౌన్): కర్నూలు అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు గురువారం మూడు నామినేషన్ల దాఖలయ్యాయి. వీటిని స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్వీకరించారు. అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నుంచి గాజుల అబ్దుల్ సత్తార్ రెండు సెట్ల నామినేషన్లు, అలాగే ఖలీల్ అహమ్మద్ ఒక సెట్టు నామినేషన్ దాఖలు పరిచారు. అనంతరం రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఈనెల 25 వ తేదీ వరకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చని తెలిపారు. ఈనెల 26, 27 తేదీల్లో నామినేషన్ల పరిశీలన ఉంటుందని, ఈనెల 29 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.

వలంటీర్ల రాజీనామా

కల్లూరు: మండలంలోని తడకనపల్లె గ్రామానికి చెందిన 14 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు రాజీనామాలను సమర్పించారు. స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పని చేస్తోందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేలు ఇస్తాననే హామీపై నమ్మకం లేదన్నారు.

నేటి నుంచి జిల్లాలో షర్మిల న్యాయయాత్ర

కర్నూలు(సెంట్రల్): ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మూడు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి 18వ తేదీ రాత్రి ఆలూరుకు చేరుకొని అక్కడే బస చేస్తారని, 19వ తేదీ ఉదయం ఆలూరులో కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఆదోనిలో, 6 గంటలకు ఎమ్మిగనూరులో జరిగే కార్నర్ మీటింగ్‌లలో ఆమె పాల్గొంటారన్నారు. అనంతరం కడపకు వెళ్లిపోతారని, 20న ఉదయం కడప పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేసి సాయంత్రం 6 గంటల కు కోడుమూరులో జరిగే సభకు హాజరవుతారన్నారు. అక్కడి నుంచి రాత్రి కర్నూలు చేరుకొని 21న నగరంలో ర్యాలీ,బహిరంగ సభలో పాల్గొంటారన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డి

కల్లూరు: ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పెద్ద నగేష్, కురువ ఎల్లయ్య, శరత్, మధు, ట్రాక్టర్ హరి, పల్లె మద్దిలేటి, షెక్షావలి సహా 50 కుటుంబాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. అర్హతే ప్రమాణికంగా పథకాలు అందించడంతో రాష్ట్రంలోని ప్రతి గడపకూ మేలు జరిగిందన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంతిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు బి.చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వాసుదేవరెడ్డి, ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, పి.రమణారెడ్డి పాల్గొన్నారు.

ఈ ప్రయాణం ప్రమాదకరం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు–కడప జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఉల్లంఘనలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సఫా ఫార్మసీ కళాశాల సమీపంలో నేషనల్ హైవే 340సీ పనులు జరుగుతుండడంతో కొందరు చుట్టూ తిరిగి రాలేక జాతీయ రహదారి 40లోనే ఎదురుగా వస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చుట్టూ తిరిగి వస్తే సమయం వృథా అవుతుందని కొందరు, డీజిల్, పెట్రోల్ ఆదా అవుతుందని మరి కొందరు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు నిబంధనలకు విరుద్ధంగా వన్‌వేలో ఎదురెదురుగా వాహనాలు నడుపుతున్నారు. ప్రమాదకరమైన ఈ ప్రయాణంపై జాతీయ రహదారుల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



జాతీయ రహదారిలో ఎదురెదురుగా వాహనాలు వెళ్తున్న దృశ్యం

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య



నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఆర్‌యూ ఉపకులపతి, ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్ కుమార్

నందికొట్కూరు: ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య అందుతుందని రాయలసీమ విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన గ్రంథాలయ భవనం, సమావేశం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం మహోన్నత సమాజ నిర్మాణానికి పునాదులన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని మేధస్సును పెంపొందించుకోవాలన్నారు. రుసా నిధులతో నూతన భవనాలను నిర్మించడం జరిగిందని స్పష్టం చేశారు. అనంతరం ప్రొఫెసర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సునీత, అధ్యాపకులు డాక్టర్ ఎం. అన్వర్ హుసేన్, గ్రంథాలయ అధికారి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటిపై దాడి

కల్లూరు: కల్లూరు అర్బన్ 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి ఇంటిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు. ఇంటి గేటు వద్ద హల్‌చల్ చేసి ఇంటిముందున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడు. కార్పొరేటర్ కుటుంబ సభ్యులకు 4వ పట్టణ పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించారు. విచారణలో నిందితుడు శిల్పావందనంలోని వాటర్‌ప్లాంట్‌లో పనిచేసే వ్యక్తిగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

మీ కాలేయం జాగ్రత్త!

- జిల్లాలో పెరుగుతున్న కాలేయ బాధితులు
- ఒకవైపు ఫ్యాటీ లివర్, మరోవైపు హెపటైటిస్ వేధింపు
- మద్యం తాగడంతో లివర్ సిరోసిస్
- హెపటైటిస్‌కు రూ.10 వేలు విలువ చేసే మందులు ఉచితం
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం

మన దైనందిన కార్యక్రమాల్లో ఎన్నో చోట్ల ఆహారాన్ని తింటుంటాము. అందులో కొన్ని విషతుల్యపదార్థాలు కూడా ఉంటాయి. ఆహారంలో మంచీచెడును వడబోసి మన ఆరోగ్యాన్ని కాపాడేదే కాలేయం. ఆహారం సరిగా జీర్ణమయ్యేందుకు, పోషకాలు మన శరీరానికి అందించేందుకు, వ్యర్థాలు బయటకు పోయేందుకు కాలేయ పనితీరు చాలా ముఖ్యం. ఇలా మన శరీరంలో ఎంతో కీలక పాత్ర పోషించే ఈ అవయవం విషయంలో అశ్రద్ధ చేస్తే కచ్చితంగా ముప్పు తెచ్చుకున్నట్లేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): మానవ శరీరంలోని అతి పెద్ద గ్రంథి కాలేయం. ఇది జీవక్రియ, రోగనిరోధకశక్తి, జీర్ణక్రియ వంటి ప్రక్రియల్లో చురుకుగా వ్యవహరిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలు ముఖ్యమైనవే అయినా వాటిలో కాలేయం కొంచెం భిన్నం. ఎందుకంటే ఏ సమస్య వచ్చినా, శరీరం ముందే సంకేతాలు ఇస్తుంది. కానీ కాలేయం విషయంలో అలా కాదు. కాలేయం పూర్తిగా నాశనమయ్యే వరకు ఎలాంటి సంకేతాలను ఇవ్వదు. అంటే తాను పూర్తిగా నాశనమయ్యే వరకు మనిషి ఆరోగ్యం కోసం శ్రమిస్తూనే ఉంటుంది. కాబట్టి ఎలాంటి సమస్యలు లేవని కాలేయాన్ని అశ్రద్ధ చేయకుండా జీవన శైలి, ఆహారపు అలవాట్లు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో ఆకుకూరలు, పీచుపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.



కాలేయ సమస్యలున్నవారే అధికం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీర్ణకోశ వ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజి)లో 2022 సంవత్సరంలో 722 మంది, 2023లో 784 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకు 347 మంది వివిధ కాలేయ వ్యాధులతో చేరి చికిత్స పొందారు. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు నగరంలోని ప్రైవేటు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్ల వద్దకు ప్రతిరోజూ 800లకు పైగా జీర్ణకోశవ్యాధులతో చికిత్స కోసం వెళ్తున్న రోగుల్లో 40 శాతం మంది కాలేయ సమస్యలున్న వారే ఉన్నారు. మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల వద్దకు జీర్ణకోశసమస్యలతో 30 నుంచి 40 శాతం వరకు బాధపడుతూ చికిత్స కోసం వస్తుండగా అందులో 20 శాతం మంది ఆల్కహాలు సేవించడం వల్ల కాలేయం దెబ్బతినడంతో వచ్చిన వారున్నారు. మిగిలిన 10 శాతం ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, హెపటైటిస్–బి, సి వైరస్ వంటి ఇన్‌ఫెక్షన్ల కారణంగా లివర్ దెబ్బతినడం వల్ల వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్ని రకాల జీర్ణకోశవ్యాధులు, కాలేయ వ్యాధులకు ఉచితంగా అత్యాధునిక వైద్యపరీక్షలు, మందులు అందజేస్తున్నారు. ముఖ్యంగా హెపటైటిస్–బి,సి వ్యాధులకు ఖరీదైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 452 హెపటైటిస్ బి రోగులకు, 627 మంది హెపటైటిస్ సి రోగులకు మందులను ఉచితంగా అందజేశారు.


కాలేయ వ్యాధి రాకుండా ఉండాలంటే ఇలా చేయాలి...

- పచ్చని ఆకుకూరలు తినాలి. ఇవి లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి.
- సల్ఫర్ ఎక్కువగా ఉండే వెల్లుల్లి పాయలు లివర్‌ను కాపాడతాయి.
- పసుపు కాలేయానికి మేలు చేస్తుంది. గ్రీన్‌టీ, ఆపిల్ పండ్లు సైతం కాలేయానికి మంచివే.
- మంచి కొవ్వులు తినండి. ఆలివ్ ఆయిల్, వాల్‌నట్స్, అవకాడోలు కాలేయాన్ని శుభ్రం చేస్తాయి.
- విటమిన్–సి ఎక్కువగా తీసుకోవాలి. ఇది కాలేయం వద్ద కొవ్వులను నియంత్రిస్తాయి.
- రోజూ నీటిని ఎక్కువగా తాగాలి. దీనివల్ల కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కాలేయ వ్యాధి లక్షణాలు

మీరు కాలేయ సంబంధిత వ్యాధిబారిన పడుతుంటే మీ శరీరం కొన్ని సంకేతాలు ఇస్తుంది. ఇందులో కాళ్లు, చీలమండలాల్లో వాపు, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, జ్వరం, కామెర్లు, కడుపు నొప్పి, మూత్రం రంగులో మార్పు, పొట్టుచుట్టూ దురద, ఎరుపు చర్మం, మలంలో రక్తం మొదలైనవి. ఈ లక్షణాలు కనిపిస్తే విస్మరించకుండా వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. రెండు అంతకంటే ఎక్కువ లక్షణాలు ఉంటే తక్షణ వైద్యసహాయం అవసరం. ఒక వ్యాధి అభివృద్ధి అయిన తర్వాత కష్టంగా మారే బదులు, కాలేయ ఆరోగ్యాన్ని ముందుగానే గ్రహిస్తే తద్వారా కాలేయ వ్యాధులువచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

ఉచితంగా వైద్య చికిత్స, మందులు



కాలేయ వ్యాధులతో బాధపడే వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉచితంగా చికిత్స అందిస్తున్నాము. ఇందులో హెపటైటిస్ బి, హెపటైటిస్ సి రోగులు ప్రైవేటుగా వైద్యపరీక్షలు చేయించుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు అవుతుంది. అలాగే మందులు సైతం కొనాలంటే నెలకు రూ.10వేల దాకా అవుతుంది. అలాంటి వైద్యపరీక్షలు, మందులు అన్నీ ఇక్కడ ఉచితంగా అందేటట్లు చేస్తున్నాము. కాలేయ వ్యాధులు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, హెచ్‌ఓడీ, గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఫ్యాటీ లివర్ కాలేయానికి చేటు



ఫ్యాటీలివర్ అనేది కాలేయం చుట్టూ కొవ్వు చేరడం వల్ల వస్తుంది. ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ఆల్కహాలు, రెండు నాన్ ఆల్కహాలు. అధికంగా ఆల్కహాలు తీసుకోవడం వల్ల ఫ్యాటీలివర్ డిసీజ్ వస్తుంది. ఆహారపు అలవాట్లు, మద్యం కారణంగా వచ్చిన ఫ్యాటీలివర్‌ను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే కాలేయం మరింత దెబ్బతినే అవకాశం ఉంది. ఒకవేళ మద్యం తాగకపోయినా ఫ్యాటీలివర్ సమస్యలు వస్తుంటే దాన్ని నాన్ ఆల్కహాల్ ఫ్యాటీలివర్ డిసీజ్ అంటారు. హెపటైటిస్–బి,సి మందులతో నయం చేసుకోవచ్చు.

–డాక్టర్ పి. అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

22 నుంచి సుంకులమ్మ బ్రహ్మోత్సవాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామదేవత సుంకులా పరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు ప్రభోత్సవం నిర్వహిస్తారు. రెండో రోజు 23వ తేదీ రథోత్సవం జరుగుతుంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయకట్టుదారులు, మేటీలతో స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి నరసయ్య సమావేశమయ్యారు. ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికల కోడ్ కారణంగా క్రీడా పోటీలు నిర్వహించడం లేదన్నారు. ఇందుకు పోలీసులు, దేవదాయశాఖ అధికారులు అనుమతించడం లేదన్నారు. ప్రభోత్సవం, రథోత్సవం కార్యక్రమాన్ని కలిసికట్టుగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వారికి తాంబూళాలు అందజేశారు. ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, లక్ష్మన్న, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మేటీలకు తాంబూళం ఇస్తున్న ఈఓ

రథానికి ప్రత్యేక పూజలు

సుంకులాపరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రథశాల నుంచి రథాన్ని భక్తులు బయటకు తీసుకొచ్చారు. ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, కార్యనిర్వహణాధికారి నరసయ్య ఆధ్వర్యంలో భక్తులు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరి కాయలు కొట్టారు.

22న బీరప్ప స్వామి వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: కల్లూరు శ్రీ బీరప్ప స్వామి మూడో వార్షిక మహోత్సవం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం శుక్లపక్షం చతుర్దశి ఉదయం 7.56 గంటలకు గోపూజ, గణపతి పూజ, కలశ స్థాపనం, గణపతి, రుద్ర, ప్రధాన దేవతా హోమాలు, బలిదానం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.